క్లుప్తంగా

నేడు ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీలో 5 సం.ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నేడు (18న) కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయి. బుధవారం ఎల్‌ఎల్‌బీ కోర్సుకు ఉదయం 10.30 లకు, ఎల్‌ఎల్‌ఎం కోర్సుకు సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలని అధికారులు తెలిపారు.

ఖమ్మంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆ జిల్లాకు చెందిన ఓయూ విద్యార్థులు, పీడీఎస్‌యూ నేతలు మంగళవారం ఎస్.నాగేశ్వర్‌రావు, ఎస్.సుమంత్ కోరారు. నేడు (18న) సీఎం కేసీఆర్ ఖమ్మంలో బీఆర్ఎస్ సభ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఉన్నత విద్య వ్యాప్తిలో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయం తెలంగాణలోను జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సభలో సీఎం కేసీఆర్ ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు.

ఓయూ పాలన పదవుల్లో ప్రొ.అన్సారీపై వివక్ష తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలన పదవుల్లో ప్రొ.అన్సారీపై వివక్ష తగదని బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అన్సారీని పాలన పదవులకు దూరంగా ఉంచి అనుభవం లేని అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్లను ఉన్నత పదవుల్లో నియమించడం అన్యాయమన్నారు. గతంలో జరిగిన చిన్న చిన్న సంఘటలను దృష్టిలో ఉంచుకొని పాలన పదవులను ఇవ్వకుండా అవమానపర్చడం దారుణమన్నారు. ఓయూలో ముస్లిం మైనార్టీలకు ముఖ్యమైన పదవుల్లో నియమించకపోవడం విచారకరమన్నారు. విజ్ఞానాన్ని అందించే వర్సిటీల్లో అధ్యాపకుల నడుమ పగలు, ప్రతీకారాలు, కక్షలకు తావు ఉండకూదన్నారు. ప్రస్తుతం ఓయూలో ఉన్న అధ్యాపకుల్లో ప్రొ.అన్సారీ సీనియర్ కావడంతో ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా అవకాశం కల్పించాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు.

బాలుడి ముక్కులో రక్త కణితి

అరుదైన శస్త్ర చికిత్సతో తొలగించిన కిమ్స్ వైద్యులు

రాంగోపాల్‌పేట్: బాలుడికి ముక్కులో పెరిగిన రక్త కణితిని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేసి తొలగించారు. అందుకు సంబంధించిన వివరాలను సర్జన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కల్యాణి వెల్లడించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన దీపక్ (12) బాలుడికి ముక్కు నుంచి రక్తం కారుతుండటంతో స్థానిక వైద్యులకు చూపించారు. ఎంతకీ నయం కాకపోవడంతో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఈఎన్‌టీ వైద్యుల వద్దకు తీసుకొచ్చారు. ముక్కుకు స్కానింగ్ చేయడగా లోపల యాంజియో ఫైబ్రోమా అనే అరుదైన బ్లీడింగ్ ట్యూమర్‌గా గుర్తించారు. దాని లోపల మొత్తం రక్తం ఉండి ముట్టుకుంటే కారుతుంది. దానికి నేరుగా శస్త్ర చికిత్స చేస్తే 2–3 లీటర్ల రక్తం పోయి ప్రాణాలకే అపాయం ఏర్పడుతుంది. రక్తస్రావాన్ని అరికట్టేందుకు ఎంబోలైజేషన్ అనే ప్రక్రియ చేయవచ్చు కానీ.. అది చాలా ఖర్చుతో కూడుకుంది. అయినా శస్త్ర చికిత్స తర్వాత కూడా మళ్లీ రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. కణితికి ఎక్కడ రక్త ప్రసారం జరుగుతుందో గుర్తించి దానికి క్లాంపింగ్ చేసి రక్తస్రావం అరికట్టి డ్రిల్లింగ్ చేసి 4–5 సెంటీ మీటర్ల మేర ఉన్న కణితిని పూర్తిగా తొలగించారు. కణితిని తొలగించినా దాని మూలాలు ఎక్కడో ఉండి మళ్లీ రెండు, మూడేళ్లలోపు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయని కణితి చిన్నగా ఉన్నప్పుడే గుర్తిస్తే శస్త్ర చికిత్స చేయడం సులభం అవుతుందని వైద్యులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

సనత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురై చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ పాండే పాత బోయిన్‌పల్లిలోని మల్లికార్జునకాలనీలో ఉంటున్నాడు. ఐదు రోజుల క్రితం అతని భార్య మగ బిడ్డకు జన్మనివ్వడంతో 15వ తేదీన అతని స్నేహితుడు రాజా బిడ్డను చూడటానికి వచ్చాడు. అదే రోజు రాత్రి రాజా తిరిగి వెళ్తేందుకు బయలుదేరగా రాజ్‌కుమార్ పాండే సోదరుడు మనోజ్‌కుమార్ పాండే (29) అతన్ని ద్విచక్ర వాహనంపై దించేందుకు వెళ్లాడు. బాలంరాయి సమీపంలోని స్కోడా షోరూం వద్ద వీరి బైక్ బారికేడ్లను ఢీకొట్టడంతో కిందపడిపోయారు. మనోజ్‌కుమార్ పాండే తీవ్రంగా గాయపడగా గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 47, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 28.

మంత్రి చొరవ..
మూల మలుపు విస్తరణ..

- ఎర్రగడ్డ–సనత్‌నగర్ రహదారిలో ఇకపై రయ్‌రయ్
- సబ్‌స్టేషన్ స్థలం కేటాయింపుతో పనులకు మోక్షం
- తీరనున్న ట్రాఫిక్ సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



ప్రహరీ కూల్చి సబ్‌స్టేషన్ స్థలాన్ని కలిపేసుకుని చేపట్టిన విస్తరణ పనులు

సనత్‌నగర్: అది ఎర్రగడ్డ చౌరస్తా–సనత్‌నగర్ మార్గం. ఈ రహదారిలో ఎఫ్‌సీఐ గోడౌన్ దాటాక సబ్‌స్టేషన్ వద్ద ఉన్న మూల మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. రోడ్డంతా ఓ తీరుగా ఉంటే.. ఇక్కడ మలుపు మాత్రం భిన్నంగా ఉంటూ వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. దీనికి కారణం ఇక్కడ రోడ్డు వెడల్పు అతి తక్కువగా ఉండడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు మలుపు తిరిగే వరకు కనిపించని పరిస్థితి. దీతో పాటు ప్రతి నిత్యం ఇక్కడే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంటుంది. ఎఫ్‌సీఐకు ధాన్యం లోడ్‌తో వచ్చే లారీలు రోడ్డుకిరువైపులా పార్క్ చేసి ఉంచుతుంటారు. ఇక ఆదివారం వస్తే అక్కడే జరిగే మార్కెట్‌తో వాహనాలు ముందుకు కదల్లేని దుస్థితి ఏర్పడుతుంది.

సబ్‌స్టేషన్ స్థలాన్ని కలిపేసుకుని..

మాస్టర్‌ప్లాన్‌లో ఈ రహదారి 100 ఫీట్లుగా ఉండగా ఈ మూలమలుపు వద్ద కనీసం 50 ఫీట్లు కూడా లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎర్రగడ్డ చౌరస్తా నుంచి సనత్‌నగర్ బస్టాండ్ వరకు రహదారి విస్తరణలో భాగంగా ఇక్కడ మూలమలుపు విస్తరణ సంగతి ఏంటా అని అధికారులు ఆలోచనలో ఉండగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సబ్‌స్టేషన్ లోపల ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డును ఆనుకుని ఉన్న సబ్‌స్టేషన్ ప్రహరీ లోపల స్థలాన్ని పరిశీలించగా కొంతమేర తీసుకుని రోడ్డు విస్తరణ చేపట్టవచ్చనే అభిప్రాయానికి వచ్చిందే తడవుగా టీఎస్‌పీడీసీఎల్ అధికారులతో అప్పటికప్పుడు సమావేశమై కార్యాచరణను ప్రారంభించారు. అనుకున్న తడవుగానే సబ్‌స్టేషన్‌కు సంబంధించిన స్తంభాలు, కేబుళ్లను తొలగించారు. నిర్దేశిత స్థలాన్ని రోడ్డుకు వదిలేసి మళ్లీ యథావిధిగా ప్రహరీని నిర్మించారు. ఇప్పుడు మూల మలుపు వద్ద విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఇక్కడి చెట్లు, ఎలక్ట్రికల్ స్తంభాల తరలింపు ప్రక్రియ పూర్తవ్వగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



అడ్డుగా మారిన ఇటీవల ఏర్పాటు చేసిన గ్రీనరీ ప్రహరీ



మొన్నటి వరకు ఇరుకుగా ఉన్న మూలమలుపు

గ్రీనరీ ఉంటుందా పోతుందా..?

మూల మలుపు వద్ద విస్తరణ బాగానే ఉండగా ఇటీవల జెక్‌కాలనీ విగ్రహం సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన డెబ్రీస్ వేస్తున్నారనే నెపంతో ఏర్పాటు చేసిన గ్రీనరీ ఇప్పుడు మళ్లీ అడ్డుగా వస్తుందనే అపవాదు ఉంది. ఒకవైపు మూలమలుపు విస్తరణకు నోచుకుంటుండగా సరిగ్గా అదే లెవల్‌లో రోడ్డుపై గ్రీనరీ ఉండడం దానిని తొలగిస్తారా? అలాగే ఉంచుతారా అనే ప్రశ్న తలెత్తుతుంది. కేవలం డెబ్రీస్ వేయకుండా ఉండేందుకే ఇక్కడ గ్రీనరీ ఏర్పాటు చేశారే తప్ప భవిష్యత్ రోడ్డు విస్తరిస్తే పరిస్థితి ఏమిటన్న ముందస్తు ఆలోచన చేయకపోవడం విడ్డూరం. గ్రీనరీలో భాగంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడమే కాకుండా ఏకంగా గ్రిల్స్‌ను కూడా ఏర్పాటు చేసేశారు.

పెట్టుబడిదారుల స్వర్గధామం తెలంగాణ: తలసాని



ఇండో కెనడా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ఎంతో అనుకూలంగా ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఆయనను ఇండో కెనడా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న పలు సంక్షేమ కార్యక్రమాల వివరాలను మంత్రి వారికి వివరించారు. కుల వృత్తులపై ఆధారపడిన వారికి ప్రభుత్వపరంగా చేయూతను అందించి ప్రోత్సహించాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రాష్ట్రంలో సరైన నీరు, విద్యుత్ ఉండేది కాదని, నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం వంటి నూతన సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడంతో పెద్ద సంఖ్యలో నీటి వనరులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వపరంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం, నూతన పరిశ్రమల ఏర్పాటుకు వాతావరణం అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండడంతో అనేక దేశాల నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతున్నారని, తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అన్ని విధాలుగా ఎంతో అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తితో ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఇండో కెనడా కో–ఆర్డినేటర్ త్రిభువన్ ఆనంద్, వికాస్‌గుప్తా, కల్పేష్ జోషి పాల్గొన్నారు.

నిరుద్యోగులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రాంగోపాల్‌పేట్: నిరుద్యోగులకు వ్యాపారాల్లో శిక్షణ అందించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ బ్రాంచ్ ఏజీఎం శ్రీనివాస్ అన్నారు. భారతీయ యువ ట్రస్టు త్రైమాసిక సదస్సును మంగళవారం హోటల్ పార్క్‌లేన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. భారతీయ యువ ట్రస్టు గత 30 ఏళ్లలో ఎంతో మంది యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేసిందన్నారు. ప్రస్తుత సమాజంలో ఎంతో మంది యువతకు వ్యాపారం ఆసక్తి ఉన్నా ఏ వ్యాపారం, ఎలా ప్రారంభించాలి, ప్రాజెక్టు రిపోర్టు ఎలా తయారు చేయాలి, రుణాలు ఎలా పొందాలి, ఉత్పత్తిని ఎలా మార్కెట్ చేసుకోవాలనే అంశాలపై అవగాహన లేదన్నారు. ఇలాంటి వారికి మార్గదర్శనం చేసేందుకు భారతీయ యువశక్తి ట్రస్టు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. ఇంకా వేలాది మంది యువత ఇలాంటి సందిగ్ధంలోనే ఉన్నారని అలాంటి వారికి సరైన శిక్షణ ఇచ్చి యువ పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్నారు. లాభదాయంగా ఉండే వ్యాపారాలకు బ్యాంకులు కూడా రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొన్ని వర్గాలు, వ్యాపారాలకు సబ్సిడీలు అందిస్తున్నాయని వివరించారు. ట్రస్టు చైర్మన్ లక్ష్మి వర్చువల్‌గా మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల యువతకు వ్యాపారంలో స్ఫూర్తిని నింపి మంచి పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామన్నారు.

ఇన్‌ఫెక్షన్లు సోకకుండా చూడాలి

సనత్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారికి ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఎస్ హైదరాబాద్ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీత ఆదేశించారు. మలక్‌పేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు బాలింతలు మృతి చెందిన దృష్ట్యా అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. అమీర్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆమె సందర్శించి వార్డులు, పరిసరాలను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అమీర్‌పేట్ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య అధికంగా ఉంటున్న నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్లలో వైద్యులు ధరించే గౌన్లు, ఉపయోగించే వస్తువులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అదే విధంగా ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులతో పాటు ఫ్లోర్ మాపింగ్ నిరంతరం జరిగేలా చూడాలన్నారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలకు వినియోగించే పరికరాలు తక్కువగా ఉన్నాయని, వీటి సంఖ్య పెంచాలని సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్ ఆమెను కోరారు. ఆమె వెంట ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో సమావేశమైన సునీత

అదనపు స్లాట్‌లను వినియోగించుకోండి

రాంగోపాల్‌పేట్: తత్కాల్, సాధారణ పాస్‌పోర్టుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు ఇటీవల అదనంగా విడుదల చేసిన అపాయింట్మెంట్‌లను వినియోగించుకోవాలని అధికారి దాసరి బాలయ్య సూచించారు. దరఖాస్తుదారులు అపాయింట్మెంట్‌ల కోసం చాలా కాలం నిరీక్షిస్తుండటంతో తాము హైదాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ఈ నెల 16వ తేదీ నుంచి అపాయింట్మెంట్‌ల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. పెంచిన అపాయింట్మెంట్ల కోసం ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటల తర్వాత పాస్‌పోర్టు వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు. డిసెంబర్‌లో 4 ప్రత్యేక డ్రైవ్ ద్వారా శనివారం కూడా దరఖాస్తులు స్వీకరించామని ఇందులో కొంత మంది గతంలో దరఖాస్తులు చేసుకున్న వారు రీ షెడ్యూల్ చేసుకున్నారని అలాంటి వారి తేదీల్లో ఉన్న ఖాళీల అపాయింట్మెంట్‌లను ఇప్పుడు ఇస్తామన్నారు.

అత్యాచారయత్నం కేసులో సిపాయికి ఐదేళ్ల జైలు

కంటోన్మెంట్: బాలికపై అత్యాచారానికి యత్నించిన కేసులో ఆర్మీ సిపాయికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. తిరుమలగిరి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం బాగల్పూర్ జిల్లాకు చెందిన బ్రిజేశ్ కుమార్ (32) సిపాయిగా పని చేస్తూ అమ్ముగూడలోని ఆర్మీ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. 2018 జూలై 17న బాధిత బాలిక ఆమె బాయ్‌ఫ్రెండ్ అమ్ముగూడ రైల్వే గేట్ వద్ద కొండ సమీపంలోని చెట్టుకింద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన బ్రిజేశ్ యాదవ్ ఆ యువకుడిపై దాడి చేయడంతో అతని పళ్లు విరిగిపోయాయి. బాలికను బలవంతంగా పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచార యత్నం చేశాడు. బాధితురాలు 100కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుల్‌ను చూసిన బ్రిజేశ్ పటేల్ అతనిపై కూడా దాడి చేసి పారిపోయేందుకు యత్నించాడు. ఎట్టకేలకు కానిస్టేబుల్ నిందితుడిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం హాకా భవన్‌లోని పోక్సో కోర్టు నిందితుడికి ఐదేళ్ల శిక్షతో పాటు రూ.2.25 లక్షల జరిమానా విధించింది.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బన్సీలాల్‌పేట్: ప్రేమ విఫలమై మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు వివరాల ప్రకారం.. కవాడిగూడ రోటరీకాలనీకి చెందిన జయసూర్య (24) మూడేళ్ల క్రితం ఓ అమ్మాయిని ప్రేమించాడు. కొన్ని రోజుల క్రితం సదరు యువతికి మరో వ్యక్తితో వివాహమైంది. అప్పటి నుంచి జయసూర్య మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల జయసూర్య అన్న విశాల్‌కు వివాహం కావడంతో రోటరీ కాలనీలో ఉన్న ఇల్లు సరిపోకపోవడంతో జయసూర్య కుటుంబం 15 రోజుల క్రితం షాపూర్‌నగర్‌కు మకాం మార్చారు. సంక్రాంతి కావడంతో స్నేహితులతో కలిసి పతంగులు ఎగరేస్తానని ఇంట్లో చెప్పి కవాడిగూడకు వచ్చాడు. ఈ నెల 15 జయసూర్య ఇంట్లో మద్య తాగి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. తల్లి రమాదేవీ పలుమార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి ఇంటికొచ్చి చూడగా ఉరేసుకొని కన్పించాడు. సోదరుడు విశాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉలిక్కిపడ్డ తార్నాక వాసులు

కొనసాగుతున్న 'రూపాలి అపార్టుమెంట్' ఘటన దర్యాప్తు

లాలాపేట: కంటికి రెప్పలా కుటుంబాన్ని కాపాడాల్సిన ఇంటి యజమానే దారుణానికి పాల్పడి కన్న తల్లి, కట్టుకున్న భార్య, అభం శుభం తెలియని కూతురును చంపి తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో తార్నాక ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తీవ్ర ఉత్కంఠ రేపిన ఘటనతో తార్నాకలోని రూపాలి అపార్టుమెంట్ పరిసరా ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.
కుటుంబ కలహాల నేపథ్యంలో నలుగురి మృతి కేసుపై స్పష్టమైన కారణాలు తెలియడానికి పోస్టుమార్టం రిపోర్టు అందలేని పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తు కొనసాగుతుందని, పోస్టుమార్టం రిపోర్టు వచ్చాకే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఓయూ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ తెలిపారు. సింధూర శరీరంలో ఉన్న విషాన్ని వైద్యులు తీసి ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపించాలి ఆ రిపోర్టు రావడానికి నెల రోజుల సమయం పడుతుందన్నారు. అప్పుడే అది ఏ విషం అనేది తెలుస్తుందన్నారు.



దహన సంస్కారాలు పూర్తి..

ప్రతాప్ (34) భార్య సింధూర(32), కూమార్తె ఆద్య(4), తల్లి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం బంధువులకు అప్పగించారు. మంగళవారం మృతదేహాలకు లాలాపేటలోని హిందు శ్మశాన వాటికలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. భార్యకు ప్రతాప్ విషమిచ్చి చంపినట్లు తెలుస్తుంది. కూతురు ఆద్యను గొంతు నులిమి, తల్లిని దిండుతో అదిమిపట్టి చంపినట్లు ప్రాథమిక దర్యాప్తుతో తెలిసింది. కాగా దీనిపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాకే అసలు కారణం తెలుస్తుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రాణాలు పదిలం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్ రాజు

బన్సీలాల్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని ట్రాఫిక్ శిక్షణా కేంద్రం ఏసీపీ శంకర్ రాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పద్మారావునగర్ ఎస్వీ కాలేజీలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి కుటుంబాలకు శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు, యువత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని హెల్మెట్ పెట్టుకొని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేసి విస్తరిస్తున్నా ప్రతి ఏటా కొత్త వాహనాలు రోడ్డుపై వస్తున్నాయన్నారు. రోడ్లపై గొడవలు పడకుండా వాహనాలను డ్రైవ్ చేసినట్లయితే ప్రజలు సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, ట్రాఫిక్ ఎస్సైలు సతీష్, శ్వేత పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సాయి శంకర్

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సాయి శంకర్ సూచించారు. మంగళవారం అడ్డగుట్టలోని ఆరోగ్య కేంద్రం నుంచి కంటి వెలుగుపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 18 ఏళ్లు ఎవరికైనా కంటి సమస్యలుంటే ఉచితంగా పరీక్షలు నిర్వహించి అప్పటికప్పుడే కళ్లజోళ్లు అందజేస్తారని అవసరమైన వారికి కంటి చికిత్సలు చేయిస్తారన్నారు. అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్, తుకారాంగేట్ బోయబస్తీలోని గంగపుత్ర సంఘం భవనంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ర్యాలీలో వైద్య సిబ్బంది రవి నాయక్, విద్యప్రీతి, జీవకిరీటం, శైలజా కల్యాణి, నవనీత, నర్సమ్మ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి..

లాలాపేట: ప్రజలందరికి కంటి వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాకలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమెను లలితాబాద్‌కు చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వారి ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ..అత్యున్నత నాణ్యత కలిగిన కంటి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు, అద్దాలు ఇస్తారన్నారు. ఈ శిబిరాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలను ప్రతిఘటించాలి

సీపీఐ నేత ఈటీ నరసింహ పిలుపు

హిమాయత్‌నగర్: క్యూబాపై అమెరికా ఆంక్షలు, చట్టవిరుద్ధ, అమానవీయ ఆంక్షలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ పిలుపునిచ్చారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే క్యూబా సంఘీభావ సభకు ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్న విప్లవ యోధుడు చేగువేరా కూతురు డాక్టర్ అలైద గువేరా, మనుమరాలు ప్రొఫెసర్ ఏస్తిఫీనా గువేరాల స్వాగత కటౌట్లను హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటీ నరసింహ మాట్లాడుతూ.. అమెరికా క్యూబాకు వ్యతిరేకంగా ప్రచారాలు చేయడం, అంతర్గత విధ్వంసం సృష్టించడం దారుణమన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ భవిష్యత్ తరాలకు సోషలిస్ట్ వారసత్వాన్ని అందించేందుకు కృషి చేస్తున్న క్యూబాను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీఎస్ బోస్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్. ఛాయాదేవి, బి.స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, నేతలు బొడ్డుపల్లి కిషన్, కంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అలైద గువేరా, ఏస్తిఫీనాల కటౌట్‌లను ఆవిష్కరిస్తున్న ఈటీ నరసింహ తదితరులు

సందడిగా 'బంధు మిలన్'



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఒడియా పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కంటోన్మెంట్: సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన ఒడియా వాసుల 'బంధు మిలన్' సందడిగా సాగింది. తిరుమలగిరిలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 1ఈఎంఈ సెంటర్ కమాండెంట్, బ్రిగేడియర్ సురేశ్ అతిథిగా హాజరయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఒడియా పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఓపీడబ్ల్యూఏ) వ్యవస్థాపక అధ్యక్షులు రష్మి రంజన్ మహాపాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నగరవ్యాప్తంగా ఉన్న ఒడియా వాసులు సుమారు 500 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఓపీడబ్ల్యూఏ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ బ్రిగేడియర్ అభిమన్యు రౌత్, ఐబీ లెంకా, బాదల్ నాయక్, శరత్ సాహెస్, విభూతి ప్రధాన్, రోషన్, సురేశ్ మహామాత్ర, రాఘవరెడ్డి పాల్గొన్నారు.